

ప్రాణం పోశారు

పొంగిన వాగు.. కొట్టుకుపోయిన కారు
ప్రవాహంలో అడ్డుకున్న వెదురు పొదలు
స్థానికుల సాహసంతో నిలిచిన ఐదు ప్రాణాలు
కోయమాధవరంలో ఘటన

ఏలూరు/వేలేరుపాడు, జూలై 18(ఆంధ్రజ్యోతి): భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా ఏజెన్సీ గ్రామాల్లో కొండవాగులు పొంగి పొర్లుతుండంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎర్రకాలువతో పాటు తమ్మిలేరు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వేలేరు పాడు మండలంలోని వాగులు పొంగడంతో మండలం నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు స్థంభించాయి. పెదవాగు ప్రమాద స్థాయిలో ప్రవహిస్తోంది. కొండ వాగులు పొంగి పొర్లడంతో కారులో కొట్టుకుపోతున్న ఐదుగురి ప్రాణాలను వెదురు పొదలు, స్థానికుల సాహసం కలగలపి నిలిపాయి. రాజమహేంద్రవరం నుంచి వేలేరుపాడు మండలం రుద్రంకోటకు గడ్డం సాయికుమార్ ఇద్దరి కుమారులు కుందనకుమార్, జగదీష్‌కుమార్, తల్లి జ్యోతి, మేనమామ రామా రావుతో కలిసి కారులో బయలు దేరారు. గురువారం మధ్యాహ్నం కోయ మాధవరం- అల్లూరు నగరం మధ్య నీటి ప్రవాహంలో వాగు దాటే ప్రయత్నం చేశారు. ఈలోగా ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు వేగంగా వచ్చి వీరి కారును కిందకు తోసుకుపోయింది. కారులోవున్న ఐదుగురు రక్షించండి అంటూ కేకలు వేయడంతో ఆ వైపు వెళుతున్న స్థానిక యువకుడు విని తక్షణం తన చేతిలో ఉన్న పొడవాటి తాడు సాయంతో వారిని రక్షించే ప్రయత్నం చేశారు. ఈలోగా కారు కాస్త ముందుకు వెళ్లి వెదురు పొదను ఢీకొట్టి నిలిచిపోయింది. కారులో ఉన్న వారంతా వెదురుపొద సాయంగా పైకి ఎగబాకేందుకు ప్రయత్నించారు. ఈలోగా జగదీష్‌కుమార్ వాగు ఉధృతికి దిగువకు కొట్టుకుపోయి ఇంకొక వెదురు పొదలో చిక్కుకున్నాడు. స్థానికి యువకుడు గామ స్తులను క్షణాల్లో పిలుచుకు వచ్చి అందరినీ రక్షించే ప్రయత్నం చేశాడు. ఒకవేళ అతను తక్షణం స్పందిం చకపోయి ఉంటే ప్రాణనష్టం సంభవించి ఉండేది. తమ వద్ద ఉన్న తాడుసాయంతో వెదురుపొదల్లోకి ఎగబాకడంతోనే కొంతలో కొంత వారు ప్రాణాలను కాపాడుకునే ప్రయత్నం చేయగా, ఈలోపే కోయమాధవరం గ్రామస్థులు చేసిన సాహసానికి ఐదుగురి నిండు ప్రాణాలు దక్కాయి.

హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు..

గురువారం ఉదయం నుంచి కురిసిన అతి భారీ వర్షాల కారణంగా పెదవాగు ప్రాజెక్టుకు భారీగా వరద పోటెత్తింది. ఈ కారణంగా తెలంగాణలోని నారాయణపురం గ్రామ సమీపంలోని కట్ట మైసమ్మ ఆలయం వద్ద పదడుగుల మేర రహదారిపై వరద నీరు ప్రవహించింది. అశ్వారావుపేట వైపు నుంచి వేలేరుపాడు వైపు వస్తున్న వాహనదారులు పెద వాగు బ్రిడ్జిపై ఎటూ వెళ్లే వీలు లేక చిక్కుకు పోయారు. ఇందులో కొన్ని ఆటోలు, మోటర్ సైకిళ్ళపై వచ్చిన వారు వరదలో చిక్కుకున్నారు. మరికొందరు కట్ట మైసమ్మ ఆలయంలో ఆశ్రయం పొందగా వరద పెరిగి ఆలయం సగానికిపైనే మునిగిపోవడంతో అక్కడ తలదాచుకున్న వారు ఆలయం షెడ్ల పైకి ఎక్కారు. ఈలోగా వరద సమాచారంతో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అక్కడికి చేరుకున్నారు. జిల్లా కలెక్టర్‌కు పరిస్థితి వివరించి 30 మందికిపైనే వరదలో చిక్కుకున్నారని హెలికాప్టర్ల ద్వారా వారిని రక్షించే ప్రయత్నం చేయాలని కోరారు. తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్థానికులు సమాచారం అందించటంతో కాపాడే ఏర్పాటు చేస్తామని చెప్పారు. మరోవైపు ఎంపీ పుట్టామహేష్ యాదవ్, కలెక్టర్, ఎస్పీలను అప్రమత్తం చేశారు. ఆ తర్వాత ఎన్‌డీఆర్ఎస్ బృందాలతో రెండు హెలికాప్టర్లు ఘటనా స్థలానికి చేరుకుని తాళ్ళ ద్వారా వరదలో చిక్కుకున్న వారిని తరలించే ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రానికి 25 మంది సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మిగిలిన వారిని హెలికాప్టర్ల ద్వారా తరలిస్తున్నారు.

జేసీబీ సాయంతో ముగ్గురిని కాపాడారు

జీలుగుమిల్లి : వరద ఉధృతికి రౌతుగూడెం బ్రిడ్జి వద్ద కాలువ పొంగి పొర్లింది. గుబ్బల మంగమ్మ ఆలయ ప్రాంతం నుంచి సమీప కొండ వాగులు ప్రవాహంతో వరద ముంచెత్తింది. గ్రామానికి చెందిన కారం రాము, గెడ్డం శ్రీరామూర్తి, వి.వెంకటస్వామి పొలం పనుల నిమిత్తం వెళ్లి వరదలో చిక్కుకు పోయారు. స్థానికులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారిని రాత్రి సమ యంలో జేసీబీ సాయంతో సురక్షిత ప్రాంతానికి తీసుకుని వచ్చారు.

వాగులో చిక్కుకున్న స్కూల్ బస్సు

బుట్టాయగూడెం : జంగారెడ్డిగూడెం ఢిల్లీ పబ్లిక్ స్కూలుకు చెందిన బస్సు విద్యార్థులను ఇళ్ళకు చేర్చేం దుకు గురువారం బుట్టాయగూడెం మండలంలో దింపేందుకు బయలు దేరింది. బుట్టాయగూడెం దాటుతుండగా తాడితోట పొలాల మధ్యలోని పంట కాలువ ఒక్కసారిగా పొంగింది. కాలువ ఉధృతిని గుర్తించని డ్రైవర్ బస్సును ముందుకు తీసుకు వెళ్ళేందుకు ప్రయత్నించగా మధ్యలో నిలిచిపోయింది. ఆ సమయంలో బస్సులో ఎనిమిది మంది పిల్లలు ఉన్నారు. బస్సు కాలువలో ఆగిపోవడాన్ని గుర్తించిన స్థానికులు, విద్యార్థులు ధైర్యం చేసి వాగులో దిగి బస్సును బయటకు నెట్టడంతో ముందుకు కదిలింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద చిక్కుకున్న భక్తులు

బుట్టాయగూడెం : గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద ఎర్ర ఎక్కుడు వాగు పొంగి వరద నీరు ముంచెత్తింది. ఆలయానికి వెళ్లే మెట్ల దారిలో సైతం వరద నీరు ప్రవహిస్తోంది. అమ్మ వారి దర్శనానికి వచ్చి వాగులు పొంగడంతో ఆలయం వద్దే చిక్కుకుపోయిన 500 మంది భక్తులను గురువారం సాయంత్రానికి వాగులు తగ్గుముఖం పట్టాక ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సురక్షితంగా బయటకు పంపించారు. మరోవైపు అమ్మవారి ఆలయానికి వెళ్లే దారిలోని కామవరం వద్ద గేటును మూసివేశారు.వాగులు తగ్గుముఖం పట్టాకనే గేట్లు తెరవనున్నట్టు తెలిపారు.


బుట్టాయగూడెం వద్ద చిక్కుకున్న స్కూల్ బస్సు


గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద వాగుల ఉధృతి

కుండపోత

జిల్లా అంతటా జోరు వాన


పెంటపాడులో వర్షం..

పల్లపు ప్రాంతాలు జలమయం
స్తంభించిన జన జీవనం
చెరువుల్లా మారిన పంట చేలు
మరో రెండు రోజులపాటు వర్షాలు
వాతావరణ శాఖ హెచ్చరికతో రైతుల్లో ఆందోళన
తక్షణ సాయం కోసం కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 18: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ఉధృతం కావటంతో జిల్లా వ్యాప్తంగా గురు వారం ఉదయం నుంచి ఎడతెరపిలేకుండా భారీగా వర్షాలు కురు స్తున్నాయి. పల్లపు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. పంట చేలు చెరువుల్లా మారాయి. మురుగుపోయే దారిలేక నారు మడులు నీటిలో నానుతున్నాయి. జిల్లాలోని పాలకొల్లు భీమవరం, ఇరగ వరం, తదితర మండలాల్లో వరినారుమడులు, నాట్లువేసిన వరిచేలు వర్షపునీటితో మునిగిపోయాయి. చేలలో మూనలు తేలి పోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లి గూడెం పట్టణంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రజలు బయట అడుగుపెట్టలేని విధంగా తయారైంది. తాడేపల్లిగూడెం మండలం లోని ఎర్రకాలువ వరదనీరు పొంగుతుండంతో పరివాహక గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏ క్షణాన వరద తమ గ్రామాలను ముంచెత్తుతుందోనని ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. నందమూరు అక్విడెక్టు వద్ద నీటిమట్టం 26 అడుగులకు చేరుకోగా కొంగువారిగూడెం జలాశయం వద్ద వరద నీరు దిగువకు వదలడంతో రైతుల్లో మరింత ఆందోళన పెరిగింది.

గూడెంలో అత్యధిక వర్షపాతం 95.8 మి.మీ

భీమవరం టౌన్ : ఏకధాటిగా వర్షం కురుస్తున్న వర్షాలకు జన జీవనం స్థంభించింది.జిల్లాలో అత్యధికంగా తాడేపల్లిగూడెంలో 95.8 మి.మీ వర్షపాతం నమోదవగా అత్యల్పంగా యలమంచిలిలో 20.4 మి.మీ నమోదైంది. పెంటపాడు మండలంలో 71.6 మి.మీ, భీమవరం 50.4, ఇరగవరం 46.4, నరసాపురం 54.6 ,పాలకొల్లు 62.2, పెనుమంత్ర 30.2, పెనుగొండ 32,4, ఆచంట 30, పోడూరు 29.4, గణపవరం 31,6, ఆకివీడు 33, ఉండి 48.2, పాలకోడేరు 45.2 వీరవాసరం 31.4, కాళ్ళ 25.2, తణుకు 25.4, అత్తిలి 33.2, మొగల్తూరు మండలంలో 34.6 మిమీ వర్షపాతం నమోదైంది.

తక్షణ చర్యలు చేపట్టండి : కలెక్టర్ నాగరాణి

వాతావరణ సూచనల మేరకు మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు, శిథిలావస్థలో ఉన్న భవనాలు, గుడిసెలు,షెడ్స్‌లో నివసిస్తున్న ప్రజలు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మునిసిపల్, ఆరోగ్య ఆర్డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఆరోగ్యశాఖ అధికారులు ఇంటింటికి వెళ్లి వ్యాధులు పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ అవసరం మేరకు మందులు అందించాలన్నారు. రెవెన్యూ నీటిపారుదలశాఖ అధికారులు కాలవగట్లు, డ్రెయిన్లు గోదావరి గట్లను పర్యవేక్షించాలని, గండ్లు పడే అవకాశం ఉంటే ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.


ఉధృతంగా యనమదుర్రు


తణుకులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

అప్రమత్తంగా ఉన్నాం : జేసీ ప్రవీణ్ ఆదిత్య

వర్షాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్నివిధాలా సిద్ధంగా ఉన్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. సెక్రటేరియట్ నుంచి గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో అధిక వర్షాలు కారణంగా చేసిన ముందస్తు ఏర్పాట్లపై జేసీ వివరించారు. జిల్లాలోని ఐదు మండ లాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా ఉందని తెలిపారు. భీమవరంలో యన మదుర్రు డ్రైన్ వుందని ఏదైనా ఇబ్బంది అయితే ఇసుక బ్యాగులను సిద్ధంగా ఉంచామన్నారు. లంక గ్రామాల్లో అవసరమైన నిత్యావసర వస్తువులను సిద్ధంగా ఉంచాం. మెడికల్ సిబ్బంది, బోట్సుమెన్స్ సొసైటీలను అప్రమత్తం చేశాం.. వశిష్ట గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలను ఇప్పటికే అప్రమత్తం చేశాం.. అనుకోని ఇబ్బంది ఏర్పడితే ఎదుర్కునేందుకు అన్ని విధాలుగా సన్నద్ధతగా ఉన్నట్లు వివరించారు. జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కర్‌రావు, డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు, డీపీవో విక్టర్, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి నాగేశ్వరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోను, జిల్లాలోను కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారని కలెక్టర్ నాగరాణి తెలిపారు. జిల్లాలో ఎటువంటి ఇబ్బందులు కలిగినా వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌నెంబరు 18816 299219 నంబరుకు సమాచారం ఇవ్వచ్చునని తెలిపారు.అదే విధంగా రాష్ట్రంలో రాష్ట్ర టోల్ ఫ్రీనెంబరు 1070కు గానీ, 1800-425-0101, 8333905022 నంబరుకు ఫోన్ చేసి సమాచారం తెలపవచ్చున్నారు.


గుంపర్రులో కౌరెంతో నారుమడిలో నీరు తోడుతున్న రైతు

నీటమునిగిన నారుమళ్లు

భీమవరం రూరల్/యలమంచిలి జూలై 18 : భారీ వర్షానికి సార్వా నారుమడులు, నాట్లు మునిగాయి. పల్లపు ప్రాంతాల్లో నారుమడులు రెండడుగులు నీటితో మునిగిపోయాయి. జిల్లాలో 2 లక్షల 11 వేల ఎకరాల సార్వా సాగుకు 10 వేల ఎకరాల్లో నారుమడులు వేశారు. వర్షాలతో 380 ఎకరాల్లో నారు మడులు మునిగాయి, 35 వేల ఎకరాలలో నాట్లు వేశారు. వాటిలో 1950 ఎకరాలు నాట్లు వర్షపు నీటికి ముంపుకు గురైనట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. 10 రోజులుగా కురుస్తున్న వర్షాలకు నారుమడులు చాలా వరకు దెబ్బతిన్నాయి.మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలపడంతో రైతులలో ఆందోళన మొదలైంది. నీటమునిగిన నారుమళ్లలోని నీటిని బయటకు మళ్లించేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మరికొన్ని రోజులపాటూ ఇదే పరిస్థితి కొనసాగితే వరినారు కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.చేలల్లో నీరు బయటకు మళ్లిస్తేనే గానీ దమ్ము చేసుకునే పరిస్థితి లేదని,ఇంజన్లతో బయటకు తోడాల్సి వస్తుందని దీనివల్ల అదనపు భారం పడుతుందని వాపోతున్నారు.


ఇరగవరంలో బురద నీటిలో బడికి వెళుతున్న విద్యార్థులు


తాడేపల్లిగూడెంలో జలమయమైన రోడ్లపై అవస్థలు


మోదుగుంటలో చెరువును తలపిస్తున్న వరి చేలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి.. హాజరైన ఎమ్మెల్యేలు నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, అధికారులు

పర్యావరణ రక్షణకు కోస్టల్ జోన్ ప్లాన్

జిల్లా కలెక్టర్ నాగరాణి

నరసాపురం, జూలై 18: పర్యావరణాన్ని కాపాడేందుకు కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలు చేయనున్నామని దీనికి అంతా సహకరించాలని జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, టూరిజం రీజనల్ డైరెక్టర్ వీరాస్వామినాయుడు, ఆర్డీవో అంబరీష్‌లు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ 2019 సీఆర్‌జెడ్ యాక్టు ప్రకారం జిల్లాలో కోస్టల్ జోన్ ప్లాన్ రూపొందించామన్నారు. తీరప్రాంత మత్స్యకారుల జీవనోపాధి, భద్రత, సముద్రతీర ప్రాంతాలు, పర్యావరణ పదిలం, ప్రమాదాల నివారణ, గ్లోబల్ వార్మింగ్, సముద్ర మట్టం పెరుగుదల అదుపు చేయడం ఈ ప్లాన్ ముఖ్య లక్ష్యమని దీనిలో భాగంగా సీఆర్‌జెడ్ పరిధిలో పరిశ్రమల ఏర్పాటు నిషేధిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడుతూ పేరుపాలెం బీచ్‌ను టూరిజంగా అభివృద్ధి చేస్తే పరిసర ప్రాంత గ్రామాలు అభివృద్ధికి నోచుకుంటాయన్నారు. తీరప్రాంతంలో మత్స్యకారుల ప్రధాన జీవనోపాధి వేటేనన్నారు. వ్యర్థాలు సముద్రంలో కలువకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. సీఆర్‌జెడ్‌ను 100 మీటర్ల మినహాయింపు ఉండేలా చూడాలని కోరారు. గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ పంట కాల్వల్లో వ్యర్థాలు కలవకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కాలుష్య నివారణలో ప్రభుత్వంతోపాటు ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వరరావు, సుభాష్, యోగరాజు, ఎఫ్‌డీవో ప్రసాద్, కమిషనర్ వెంకటేశ్వరావులు పాల్గొన్నారు.


పెనుమలూరులో ఎంపీడీవో కుటుంబాన్ని పరామర్శిస్తున్న కలెక్టర్ నాగరాణి, మాజీ ఎమ్మెల్యే బండారు - మెయిన్‌లో

నరసాపురం ఎంపీడీవో కోసం నలుగురు డీఎస్పీలతో టీం 7

రీ సర్వేతో భూమి గోవిందా!



ఉండి మండలం యండగండిలో గోపాలకృష్ణం రాజు పేరుతో 13 ఎకరాల భూమి ఉంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభు త్వంలో రీసర్వే చేశారు. మొత్తం 39 సెంట్లు తక్కువ వచ్చిందంటూ అధికారులు నోటీసులు ఇచ్చారు. గోపాలకృష్ణం రాజు తల్లి పేరుతో ఉన్న 5 ఎకరాల భూమిలో మరో 20 సెంట్లు తక్కువగా ఉందంటూ నోటీస్ పంపారు. మొత్తంపైన ఒకే కుటుంబంలో 59 సెంట్లు భూమికి కోత పడింది. ఇదేమిటని ప్రశ్నించే పరిస్థితి లేదు. వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో రీసర్వే తప్పిదాలకు ఇదొక ఉదాహరణ మాత్రమే..

ఇప్పటికే జిల్లాలో చిక్కులు.. రైతులకు నోటీసులు
సమస్య పరిష్కారం కాక ఇబ్బందులు
రద్దు చేయాలంటూ రైతుల నుంచి డిమాండ్
సర్వే నిలుపుదలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకారం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

భూముల రీసర్వేలో రైతులు పడ్డ ఇబ్బందులు అంతా ఇంతా కాదు. పొలాల హద్దులను మార్చేశారు. విస్తీర్ణం తగ్గిం చారు. ఒకరి హద్దులో ఉన్న భూమిని మరొకరిదంటూ తేల్చారు. హడావుడిగా చేసిన రీసర్వేలో రైతులు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారు. భూములకు రక్షణ కల్పించాలన్న ఉద్దేశంతో జగనన్న భూ సురక్షను అమలు చేస్తున్నామంటూ అధికారులు చెప్పుకొచ్చారు. కానీ ఆచరణలో మాత్రం ఎన్నో తప్పిదాలు చోటు చేసుకున్నాయి. వైసీపీ నేతలు రీసర్వేను అడ్డు పెట్టుకుని తమకు గిట్టని రైతులను ఇబ్బందిపెట్టే సందర్భాలు అనేకం ఉన్నాయి. లక్ష్యాలను నిర్దేశించి మరీ సర్వే పూర్తి చేసేందుకు ప్రయత్నించారు. మార్చి నాటికి జిల్లాలో సర్వే పూర్తి కావాలని ఆదేశాలు జారీ చేశారు. దాంతో ఎన్నికల ముందు అధికారులంతా సర్వేలో మునిగి తేలారు. అదే రైతులను ఇబ్బందులకు గురి చేసింది. కొందరి రైతులు మధ్య ఘర్షణ వాతావరణాన్ని కల్పించింది. వీటిని పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైంది. సర్వే సిబ్బంది చెప్పిందే వేదమైంది. ఇప్పటికీ అవే సమస్యలు వెంటాడుతున్నాయి.

సర్వే నిలుపుదల

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రీ సర్వేను నిలిపి వేస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ప్రకటించారు. దాంతో రైతులకు కొంత ఊరట లభించి నట్టయింది. మరోవైపు ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో చట్టాన్ని అధికారికంగా రద్దు చేయనున్నారు. వైసీపీ ప్రభు త్వంలో తీసుకొచ్చిన ఈ చట్టం ప్రకారం భూ వివాదాలు తలెత్తితే అధికారులే పరిష్కరిస్తారు. లేదంటే హైకోర్టును ఆశ్రయించాలి. అంతేతప్ప స్థానికంగా సివిల్ కోర్టుకు వెళ్లేందుకు అవకాశం లేదు. మరోవైపు తమ భూమి రెడ్ మార్క్‌లో ఉన్నట్టు రెండేళ్లు చూసుకోకపోతే అది ఇతరుల పేరులోకి మారిపోనుంది. రెండేళ్లలోగానే అధికారులను సంప్రదించి వివాదాన్ని పరిష్కరించుకోవాలి. ఇది అధికార దుర్వి నియోగానికి తావిచ్చేలా ఉందంటూ రైతులు ఆందోళన చెందారు. వైసీపీ ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే ఇటువంటి నిబంధనలతో కొత్త చట్టం తీసుకొచ్చిందంటూ రైతులు బెంబేలెత్తిపోయారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత టైటిలింగ్ యాక్ట్ రద్దుకు నిర్ణయం తీసుకుంది. పాస్ పుస్తాకాల్లో జగన్ బొమ్మ లేకుండా చర్యలు చేపట్టింది. అయితే ఇప్పటికే పూర్తయిన రీసర్వే భూముల పరిస్థితి ఏమిటంటూ రైతులు గుబులు చెందుతున్నారు.

ఉద్యోగులకూ ఇబ్బందులే

రీసర్వేలో ఉద్యోగులు కూడా ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. అధికారులే అంతా భరించారు. సర్వే సిబ్బందికి సరైన వసతి కూడా లేకుండా పోయింది. టీఏ, డీఎలు కూడా ఇవ్వలేదు. పైగా సరిహద్దు రాళ్లంటూ జగన్ బొమ్మతో ఉన్న రాళ్లను పాతిపెట్టారు. పంట పొలాల్లో సరిహద్దు రాళ్లను వేసిన తర్వాత రైతుల్లో మరింత అలజడి రేగింది. కొన్ని చోట్ల హద్దులు మారిపోయాయి. డ్రోన్ సర్వేలు నిర్వహించారు. ఫొటోలు తీశారు. మ్యాప్‌లు సిద్ధం చేసుకున్నారు. తీరా రీ సర్వేలో భూములకు రక్షణ ఉంటుందని రైతులు అనుకుంటే ఉన్న భూమిలో ఇబ్బందులు తలెత్తాయి. వైసీపీ నేతలు మాత్రం అసైన్డ్ భూములను తమకు అను కూలంగా మార్చు కోవడానికి రీసర్వే కూడా దోహదపడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం అసైన్డ్ ల్యాండ్ క్రమబద్ధీకరణను కూడా రీసర్వేతోనే ఏకకాలంలో అమలు చేసింది. ఫలితంగా తమ ఆధీనంలో ఉన్న భూములను వైసీపీ నేతలు క్రమబద్ధీకరించుకున్నారు తప్ప సామాన్య రైతులకు న్యాయం చేకూరలేదు. ఇప్పటికీ నోటీసులు అందుకున్న రైతులు ఏం చేయాలో పాలుపోలేని స్థితిలో ఉన్నారు.

పూర్తిగా రద్దు చేయాలి

వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన రీసర్వే నిలిపి వేస్తామంటూ సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇప్పటికే గ్రామస్థాయిలో సర్వే పూర్తయిన భూములున్నాయి. రీసర్వేతో ఉత్పన్నమైన సమస్యలకు పరిష్కారం లేకపోయింది. దాంతో రీసర్వేను పూర్తిగా రద్దు చేయాలంటూ రైతులు కోరుతున్నారు. ప్రభుత్వానికి ఈ విషయమై విన్న వించుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. రైతు సంఘాల్లో, రైతు సమస్యలపై పోరాడే రైతులంతా సంఘటితమవుతున్నారు.


పాలకొల్లు మంచినీటి సరఫరా పథకం పరిశీలిస్తున్న మంత్రి రామానాయుడు

జగన్ పాలనలో తాగునీటి నిధులకూ చిల్లు

నిధులు మళ్లించిన వైసీపీ ప్రభుత్వం
మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు టౌన్, జూలై, 18 : వైసీపీ ప్రభుత్వం మంచి నీటి ప్రాజెక్టలను నిర్వీర్యం చేసి అటకెక్కించిందని మున్సిపాలిటీల్లో పనులు జరగకుండా, రక్షిత మంచినీరు ఇవ్వకుండా ప్రజల ఆరోగ్యాలతో చెలగాట మాడిందని రాష్ట్ర ఇరిగేషన్ శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు పట్టణంలో రక్షిత నీటి పథకం ద్వారా ప్రజలకు అందిస్తున్న మంచి నీటి సరఫరాను అధికారులతో కలిసి గురువారం మంత్రి పరిశీలించారు. మంచినీటి ట్యాంకులు, పంపింగు హౌస్, పవర్‌హౌస్, జనరేటర్లు, వాటర్ టెస్టింగ్ ల్యాబ్, తదితర విభాగాలను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ 2018లో ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు, మంత్రి పి.నారాయణ ముందుచూపుతో ఆలోచన చేసి విజ్జేశ్వరం నుంచి డైరెక్ట్‌గా మున్సిపాలిటీలకు మంచినీరు అందించేందుకు రూ.5,350 కోట్లు నిధులు మంజూరు చేసి టెండర్లు, వర్క్ ఆర్డర్లు ఇచ్చారన్నారు. ఆ నిధులను జగన్ ప్రభుత్వం మళ్లించిందన్నారు. తిరిగి మంచినీటి వ్యవస్థను పునరుద్ధరిస్తామని దీనికి అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. నీటి సరఫరాలో నిర్లక్ష్యం లేకుండా అన్ని ప్రోసెస్‌లను పాటించి రక్షిత మంచినీరు సరఫరా చేయాలని లేకపోతే చర్యలు తీసుకుంటా నన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మున్సిపల్ కమీషనర్ బి.విజయ సారధి, డీఈ కె.రాజ్‌కుమార్, ఏఈ సాంబశివ, కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, జీవి, బోనం చినబాబు, కర్నేన గౌరునాయుడు, జక్కంపూడి కుమార్, తదితరులు పాల్గొన్నారు.



చెస్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

21న జిల్లాస్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్

భీమవరం అర్బన్, జూలై 18: చదరంగం క్రీడ ద్వారా మేధాశక్తి పెరుగుతుందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఇంటర్నేషనల్ చెస్ డే సందర్భంగా ఈనెల 21న భీమవరంలో ఏఆర్ఆర్ రెసిడెన్సీలో జరిగే జిల్లా స్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. జిల్లా చెస్ అసోసియేషన్ వారు చెస్ పోటీలు నిర్వహించడమే కాకుండా పాల్గొనే ప్రతి విద్యార్థికి రూ.600 విలువైన చెస్ కిట్టును అందించడం అభినందనీయం అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ చెస్ పోటీలలో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు 90632 24466 నంబరులో సంప్రదించాలని కోరారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తోట హరిబాబు, కార్యదర్శి మైలాపురి మురళి తదితరులు పాల్గొన్నారు.

క్యాస్ట్ సర్టిఫికెట్ల జారీలో టార్గెట్లు సరికాదు

ఏలూరు రూరల్, జూలై 18: ఇటీవల అధికారులు సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్ల విషయంలో ఉన్న లోపాలను రెవెన్యూ మంత్రి, సీసీఎల్‌ఏ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా క్రిందిస్థాయిలో వాస్తవ పరిస్థితిని తెలుసుకోకుండా వీఆర్వోలను టార్గెట్ల పేరుతో ఇబ్బందులు పెట్టడం సరికాదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర కార్యదర్శి ఎం.అప్పలనాయుడు ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గత వారం నుంచి కౌలు కార్డులకు సంబంధించి గతంలో ఉన్న టార్గెట్లు పెంచి, ఇప్పుడు మళ్లీ కౌలురైతుల కార్డులపై టార్గెట్లు పెట్టి ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్ల విషయంలోనూ ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. గత పదిహేను రోజుల నుంచి వీఆర్వోల లాగిన్‌లకు పంపినా ధ్రువపత్రాలు అన్నీ క్లియర్ చేయాలని అధికారులు ఒత్తిడితేవడం సమంజసం కాదన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అర్థం చేసుకునే వారు లేకపోవడం బాధాకరమని వీఆర్వోలపై ఒత్తిడి తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు.

నన్నయ ఇన్‌చార్జి వీసీగా ఆచార్య శ్రీనివాసరావు



ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆచార్య శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం, జూలై 18: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతిగా ఆచార్య వై.శ్రీనివాసరావును నియమిస్తూ గురువారం ఉన్నతవిద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నన్నయ విశ్వవిద్యాలయం భూగర్భ శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా, ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ డీన్‌గా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా శ్రీనివాసరావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీసీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన వీసీగా బాధ్యతలు స్వీకరించారు. తనపై ఉన్ననమ్మకంతో వర్శిటీ ఇన్‌ఛార్జి వీసీగా నియమించిన గవర్నర్, యూనివర్శిటీ కులపతి అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, నాయకులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. నన్నయ విశ్వవిద్యాయలయం అభివృద్ధికి త్రికరణశుద్ధిగా పనిచేస్తానన్నారు. నన్నయ రాజమహేంద్రవరం, తాడేపల్లిగూడెం, కాకినాడ ప్రాంగణాలతో బాటు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల ప్రతినిధులు, అధ్యాపకుల సమష్టి కృషితో విశ్వవిద్యాలయాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు కృషిచేస్తానన్నారు.

వసతి గృహం నుంచి పారిపోయిన ముగ్గురు బాలికలు

▸▸ సెక్యూరిటీ గార్డు చొరవతో నున్న పోలీసులకు అప్పగింత



రాజేశ్‌కు నగదు బహుమతి అందజేస్తున్న డీసీపీ, సీఐలు

పాయకాపురం, జూలై 18 : ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం నుంచి పారిపోయిన ముగ్గురు బాలికలు గురువారం నున్న రూరల్ స్టేషన్‌కు చేరారు. ఓ సెక్యూరిటీ గార్డు చొరవ చూపి బాలికలను సురక్షితంగా పోలీసులకు అప్పగించాడు. వెస్ట్ డీసీపీ టి.హరికృష్ణ గురువారం నున్న రూరల్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. డీసీపీ కథనం మేరకు.. విజయవాడ నగరానికి చెందిన ముగ్గురు బాలికలు ఆగిరిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్నారు. బాలికలకు అక్కడ ఉండడం ఇష్టం లేక తల్లిదండ్రులను చూడాలని భావించారు. అనుకున్నట్టుగా గురువారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో గుట్టుచప్పుడు కాకుండా వసతి గృహం నుంచి బయటకు వచ్చేశారు. కొంతదూరం నడుచుకుని వచ్చిన తరువాత ఆగిరిపల్లి వద్ద విజయవాడ బస్సు కోసం ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో ఆగిరిపల్లి నుంచి నున్న గ్రామంలోని రిలయన్స్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న కూరపాటి రాజేష్ ముగ్గురు బాలికలను గమనించాడు. వారితో పాటు బస్సు ఎక్కిన రాజేష్ బాలికలతో మాట్లాడి వారు పారిపోతున్నారని తెలుసుకుని బస్సు కండక్టర్, డ్రైవర్లకు చెప్పి అప్రమత్తం చేసి నేరుగా నున్న రూరల్ పోలీసు స్టేషన్ వద్ద బస్సు ఆపి ముగ్గురు బాలికలను పోలీసులకు అప్పగించాడు. డీసీపీ బాలికలతో మాట్లాడి విషయం తెలుసుకుని బాలికల తల్లిదండ్రులకు అప్పగించారు. బాలికలను బాధ్యతగా పోలీసులకు అప్పగించినందుకుగాను డీసీపీ సెక్యూరిటీ గార్డు రాజేష్‌ను సత్కరించి, నగదు బహుమతిని అందజేశారు. బాలికలు వసతి గృహం నుంచి వెళ్లిపోవడానికి గల కారణాలను విచారిస్తున్నామన్నారు. సీఐ దుర్గా ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక బృందాల గాలింపు

▸▸ నరసాపురం ఎంపీడీవో కోసం నలుగురు డీఎస్పీలతో టీం

▸▸ బెదిరింపు కాల్స్ వచ్చినట్టు సమాచారం

▸▸ ఐజీ పర్యవేక్షణలో కృష్ణా జిల్లా ఎస్పీ దర్యాప్తు

పెనమలూరు, జూలై 18 : నరసాపురం ఎంపీడీవోగా విధుల నిర్వహిస్తూ అదృశ్యమైన మండవ వెంకటరమణారావు కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్టు కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు గురువారం తెలిపారు. ప్రాథమిక దర్యాప్తు మేరకు రమణారావు మాధవాయిపాలెం ఫెర్రీ విషయంలో రూ.55 లక్షల బకాయిల విషయంలో తీవ్ర ఒత్తిడికి గురైనట్టు తెలిసిందని ఎస్పీ తెలిపారు. అలాగే కొన్ని ఫోన్‌ల నుంచి కాల్స్ వచ్చినట్లు, ఆ కాల్స్ విషయంలో మరింత ఒత్తిడికి గురైనట్లు, కొంత డబ్బును ఆ కాలర్స్‌కు బ్యాంకు ద్వారా జమ చేసినట్టు తెలిసిందన్నారు. వీటన్నింటి మీద పూర్తిస్థాయి దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తు, గాలింపు చర్యలకు తన ప్రత్యక్ష పర్యవేక్షణలో నలుగురు డీఎస్పీలు, నలుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలు, 150 మంది సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. ఈ మొత్తం దర్యాప్తును పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సహకారంతో ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ పర్యవేక్షిస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. అదృశ్యమైన ఎంపీడీవో సమాచారాన్ని 94407 97400, 94406 27051, 94910 63910 నంబర్లకు తెలియపరచాలని కోరారు.

ఎత్తైన భవనం.. భవనానికి నాలుగు వైపులా కోట మాదిరి బురుజులు.. బర్మా టేకుతో చేసిన సింహద్వారాలు.. తలుపులపై అందంగా చెక్కిన కళ రూపాలు.. విశాలమైన గదులు.. మయసభను తలపించే సెంట్రల్ హాలు.. మైసూర్ ప్యాలెస్‌ను తలపించే అద్భుత నిర్మాణం ఆ భవనం.. విద్యుత్ సౌకర్యం లేని రోజుల్లోనే జనరేటర్ ఆధారంగా విద్యుత్ దీపాల కాంతులతో ధగధగలాడిన భవనం స్థానికులకు చిరపరిచితం. కొత్తవారిని అబ్బుర పరిచే గంధర్వ మహల్. పలువురు ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారులకు ఆతిథ్యం ఇచ్చిన ఘనత గంధర్వ మహల్ సొంతం.

- ఆచంట



గంధర్వ మహల్

వందేళ్ల గంధర్వ మహల్

ఆచంటలో అబ్బురపరిచే చారిత్రక కట్టడం



అబ్బురపరిచే సెంట్రల్ హాల్

రాజుల పాలనలో కోటలు అద్భుత కట్టడాలు. రాచరికం అంతరించి జమిందారీ వ్యవస్థ వచ్చింది. రాజుల తరహాలో జమిందారులు కూడా అద్భుత భవనాలు నిర్మించి తమ వైభవం చాటే ప్రయత్నం చేశారు. జిల్లాలో పూర్వపు రోజుల్లో రెండే రెండు కుటుంబాలు ఆదాయ పన్ను చెల్లించేవారని చెబుతారు. ఒకటి ఏలూరుకు చెందిన మోతి జమిందార్ కుటుంబం.. రెండోది ఆచంటకు చెందిన గొడవర్తి వారి కుటుంబం.. 1916లో గొడవర్తి కుటుంబంలో యువకుడు గొడవర్తి నాగేశ్వరరావు ఓ అద్భుత భవనాన్ని నిర్మించాలని భావించాడు. ఆయన రాజస్థాన్ వెళ్లి అక్కడి కోటలు, కట్టడాలను పరిశీలించారు. అనంతరం ఆచంటలో 1918లో గంధర్వ మహల్ నిర్మాణం మొదలు పెట్టారు. 1924లో నిర్మాణం పూర్తయింది. విద్యుత్ సౌకర్యం పూర్తిస్థాయిలో లేని రోజుల్లో విదేశాల నుంచి విద్యుత్ దీపాలు రప్పించి జనరేటర్ ద్వారా భవనం అంతా రంగు రంగుల దీపాలతో జిగేలమనిపించేవారని పూర్వీకులు చెబుతారు. గంధర్వ మహల్ పేరుకు తగ్గట్టుగానే గంధర్వులే నిర్మించారా అన్నట్టుగా అద్భుత కళా నైపుణ్యంతో చూపరులను ఆకట్టుకుంటుంది. వందేళ్ల క్రితం సర్వాంగ సుందరంగా నిర్మితమైన గంధర్వ మహల్ నేటికి చెక్కు చెదరలేదు. అప్పటి, ప్రస్తుత ముఖ్యమంత్రులు మర్రి చెన్నారెడ్డి, ఎన్‌టీ.రామారావు, చంద్రబాబు నాయుడు పలువురు మంత్రులు ఈ భవనంలో ఆతిధ్యం స్వీకరించారు. ఈ భవనాన్ని చూసిన వారు మైసూర్ మహరాజ్ ప్యాలెస్ గోల్కొండ కోట చూసిన అనుభూతి పొందుతారు. అడుగడుగునా రాచఠీవితో నాటి జమిందారి వ్యవస్థ వైభవానికి ప్రతీకగా గంధర్వ మహల్ నిలిచింది. మహల్ నిర్మాణం కోసం బర్మా నుంచి టేకు, కలప, బెల్జియం అద్దాలు, లండన్ నుంచి ఇనుప గడ్డర్‌లు దిగుమతి చేసుకున్నారు. సున్నపు రాయి, కోడిసొనతో చేసిన సిమెంట్‌తో భవనం నిర్మించినట్లు భవనంలో నివసిస్తున్న కుటుంబంలో ఒకరైన గొడవర్తి శ్రీరాములు వివరించారు.





సింహద్వారం
మహల్‌లో ఉన్న పియానో

1885 నాటి పియానో

గంధర్వ మహల్ సెంట్రల్ హాలులో దర్శనమిచ్చే పియానో అదనపు ఆకర్షణగా నిలుస్తుంది. గొడవర్తి కుటుంబంలో సంగీత ప్రియులు లండన్ నుంచి పియానో తెప్పించారు. 1885లో లండన్‌లో నిర్వహించిన ప్రదర్శన పోటీలలో పురాతన పియానోగా రజత పతకం పొందడం విశేషం. పియానో మీటడంలో పూర్తిస్థాయి ప్రావీణ్యం లేకున్నా ఇప్పటికీ తాను కొన్ని స్వరాలు పలికిస్తానని ఇప్పటి తరం శ్రీరాములు చెబుతారు.

నేడు గంధర్వ మహల్ వందేళ్ల పండగ

గంధర్వ మహల్ నిర్మించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా జమీందార్ గొడవర్తి నాగేశ్వరరావు వారసులు ఈ నెల 19న వేడుకలు నిర్వహించనున్నారు. నాగేశ్వర రావు అనంతరం మూడో తరాల వారసులు గంధర్వ మహల్‌లో నివసిస్తున్నారు. నాలుగో తరం వారం కొందరు విదేశాలలో స్థిరపడ్డారు. మూడు, నాలుగు తరాల వారంతా ప్రస్తుత వేడుకలకు హాజరవుతున్నారు.

చెక్కు చెదరని కట్టడం

జమిందార్ గొడవర్తి నాగేశ్వరరావు 1924లో గంధర్వ మహల్‌ను నిర్మించారు. ఈ మహల్ నిర్మించి 2020 నాటికి వంద వసంతాలు పూర్తి చేసుకున్నా చెక్కు చెదరలేదు. 1918లో చేపట్టిన భవన నిర్మాణానికి అప్పట్లో సుమారు రూ.10 లక్షలు వెచ్చించినట్టు అంచనా. నిర్మాణ పనులకు ఆరేళ్ల కాలం కాగా 1924లో పూర్తయింది. అర ఎకరం విస్తీర్ణంలో నిర్మితమైన భవనం గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిపి నాలుగు అంతస్తులు. 12 పడక గదులతో కలిపి మొత్తం 25 గదులు. 1969, 2008 రంగులు వేశారు. తాజాగా వందేళ్ల పండుగకు ఇటీవల మళ్లీ రంగులు వేయించారు. ప్రస్తుతం భవనం మొత్తం రంగులు వేయడానికి రూ.25 లక్షలు వెచ్చించారు.

చారిత్రక వారసత్వం



మా కుటుంబీకులు గంధర్వ మహల్ చారిత్రక వారసత్వం. మహల్ నిర్మించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 19న మా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నాం. భవనం నిర్మాణమైన తర్వాత మూడు సార్లు రంగులు వేయించాం. ఈ వేడుకలకు మా కుటుంబ సభ్యులతోపాటు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

- గొడవర్తి శ్రీరాములు, మాజీ సర్పంచ్
గంధర్వ మహల్ కుటుంబ సభ్యుడు

జోరు వర్షంలోనూ వెంకన్న దర్శనం..





తుండ్లు కప్పుకుని దర్శనానికి వెళ్తున్న భక్తులు
దర్శనానంతరం బయటకు వస్తున్న భక్తులు

ద్వారకాతిరుమల, జూలై 18: జోరున వర్షం కురుస్తున్నా.. రహదారులన్నీ జలమయమైనా శ్రీవారి భక్తులకు అవేవీ ఆటంకం కాలేదు. భక్తిపారవశ్యం ముందు అవన్నీ చిన్నపాటి సమస్యలే అని నిరూపించారు. గురువారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నా సరే లెక్కచేయకుండా ఆలయానికి అధిక సంఖ్యలోనే భక్తులు విచ్చేశారు. వీరంతా గొడుగులు, తుండ్లు తలపై ఉంచుకుని క్షేత్రపరిసరాల్లో సంచరించారు. కొందరైతే స్వామివారి దర్శనానికి తడుస్తూనే వెళ్లివచ్చారు.



ఎర్రకాల్వ, జల్లేరు జలాశయాల నుంచి నీటి విడుదల దృశ్యాలు.. తమ్మిలేరు కాజ్‌వే వద్ద వరద ప్రవాహం

జలాశయాల నుంచి నీరు విడుదల

ఏలూరుసిటీ/జంగారెడ్డిగూడెం/బుట్టాయగూడెం/చాట్రాయి/చింతలపూడి : జంగారెడ్డిగూడెం మండలంలోని శ్రీకరాటం కృష్ణమూర్తి ఎర్రకాల్వ జలాశయంలోకి గురువారం వరదనీరు పోటెత్తింది. జలాశయం నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 82.40 మీటర్లు వరకు నీరు చేరిందని ఇరిగేషన్ ఏఈ సీహెచ్.భాస్కరరావు తెలిపారు. గంటకు 72,111 క్యూసెక్కుల వరదనీరు జలాశయంలోకి వచ్చి చేరుతుండగా జలాశయం గేట్లు తెరచి 10,239 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు వదిలినట్టు తెలిపారు. ఎర్రకాలువ దిగువ ఉన్న జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, నల్లజర్ల, తాడేపల్లిగూడెం, నిడదవోలు మండలాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జలవనరుల శాఖాధికారులు సూచించారు.

జల్లేరు జలాశయం నుంచి 1,500 క్యూసెక్కులు..

బుట్టాయగూడెం మండలంలోని గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయంలోకి వరద ఉధృతి పెరగడంతో గేట్లు ఎత్తి 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ డీఈ ఆనంద్, ఏఈలు సురేష్, తులసీ తెలిపారు. ప్రస్తుతం జలాశయంలోకి 3 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తోందని, జలాశయం పూర్తి నీటిమట్టం 217.80 ఎంటీఎస్ కాగా ప్రస్తుతం 215 ఎంటీఎస్‌లకు చేరడంతో ముందు జాగ్రత్త చర్యగా 1,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు తెలిపారు.

తమ్మిలేరు రిజర్వాయర్‌కు వరద నీరు

చింతలపూడి సమీపంలోని నాగిరెడ్డిగూడెం వద్ద ఉన్న తమ్మిలేరు రిజర్వాయర్‌కు ఎగువ నుంచి వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం నీటిమట్టం 336.33 అడుగులు ఉంది. ఎగువ నుంచి 858 క్యూసెక్కుల వరదనీరు చేరుతోంది. ఎగువ తెలంగాణలో వర్షాలు పడుతున్నందున శివపురం వద్ద వంతెనకు ఆనుకుని వాగులో వరద నీరు వస్తోంది. తమ్మిలేరు రిజర్వాయర్, గోనెలవాగు రెండుబేసిన్‌లు ఉన్న బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వచ్చిన వరద నీరు తమ్మిలేరు రిజర్వాయర్‌లో చేరి అక్కడి నుంచి గోనెలవాగులోకి చేరుతుంది. రెండు బేసిన్‌లు నిండిన తరువాత 348 అడుగులు దాటితే వరద నీరు దిగువకు విడుదల చేస్తామని ప్రాజెక్టు ఏఈ పరమానందం తెలిపారు.

నేడు ఏజెన్సీలో స్కూళ్లకు సెలవు

బుట్టాయగూడెం : అల్పపీడనం కారణంగా ఏజెన్సీ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున శుక్రవారం కూడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేయడంతో ఈనెల 19న ఏజెన్సీ ప్రాంతంలోని అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించామని కేఆర్ పురం ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ తెలిపారు. గురువారం ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లో పీవో పర్యటించి ముందు జాగ్రత్తలను వివరించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



డాక్టర్ సుమన్ నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ రఘునందనరావు

ఏలూరు క్రైం, జూలై 18 : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (అకడమిక్) డాక్టర్ రఘునందనరావు వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ విభాగాలను, వార్డులను, అత్యవసర విభాగాన్ని, ఐసీయూ విభాగాన్ని పరిశీలించారు. నేరుగా రోగులతో మాట్లాడారు. వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా ఆసుపత్రులు ఉన్నప్పుడు అన్ని విధాల సేవలు అందేవని ప్రస్తుతం అరకొరగా వైద్య సేవలు అందుతున్నాయని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఆసుపత్రిలో పడకలు తగ్గించారని, ప్రతి కేసు కూడా ఇక్కడ బెడ్స్ లేవంటూ విజయవాడ, గుంటూరు రిఫర్ చేస్తున్నారంటూ ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అత్యవసర విభాగంలో డాక్టర్ సుమన్ నుంచి ఆసుపత్రికి వచ్చే కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి అన్ని చర్యలు చేపట్టామని ఇప్పటికే ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలోనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి మరో వంద పడకలు అదనంగా మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు మెరుగైన వైద్య సేవలు అందించారని అయితే ఇప్పుడు ఆ విధంగా వైద్య సేవలు అందించలేకపోతున్నారనే దానిపై విచారణ చేపట్టామన్నారు. ఆసుపత్రి పరిస్థితులను ఇన్‌ఛార్జి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏఆర్ఎస్ శ్రీనివాసరావు, ఆర్ఎంవో డాక్టర్ ప్రసాదరెడ్డి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ ఎఎస్ రామ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లికార్జునరావు పలువురు పాల్గొన్నారు.

గంగానమ్మ గుడిని ఢీకొట్టిన లారీ



గంగానమ్మ గుడిని ఢీ కొన్న లారీ

ఏలూరు క్రైం, జూలై 18 : అతివేగంగా వెళుతున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న గంగానమ్మ గుడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో గుడి ప్రహరీ కూలి గోడలు కొంతభాగం దెబ్బతిన్నాయి. లారీ డ్రైవర్‌కి స్వల్ప గాయాలయ్యాయి. ఏలూరు నుంచి మాదేపల్లి రోడ్‌లో గురువారం ఉదయం వెళుతున్న చేపల మేత కంటైనర్ లారీ అదుపుతప్పి మాదేపల్లిలోని గంగానమ్మ గుడిని ఢీకొంది. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. లారీ డ్రైవర్, లారీ యజమాని కలిసి గుడి నిర్వాహకులతో చర్చలు నిర్వహించుకుని సమస్య పరిష్కరించినట్టు తెలుస్తోంది.

క్రైం కార్నర్

లారీని ఢీకొట్టి ఓఎన్‌జీసీ ఉద్యోగి దుర్మరణం

యలమంచిలి, జులై 18:దేవరపల్లి గ్రామానికి చెందిన కాళ్ల సత్యనారాయణ(49) కాజ గ్రామపరిధిలోని జాతీయరహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో మృతి చెందినట్టు ఎస్ఐ కె.శివన్నారాయణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. చింతలమోరి ఓఎన్‌జీసీలో ఉద్యోగం చేస్తూ నరసాపురంలో సత్యనారాయణ నివాసం ఉంటున్నాడు. యథావిధిగా బుధవారం విధులు ముగించుకుని బైక్‌పై నరసాపురం తిరిగి వస్తున్న అతడిని కాజ జాతీయరహదారిపై అతడి ముందు వెళుతున్న లారీ సడన్‌గా ఆగడంతో.. లారీని ఢీకొట్టిడు. అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వ్యాన్ ఢీకొని ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, జూలై 18:ఆసుపత్రిలో ప్రసవించిన మహిళను చూసేందుకు బైక్‌పై వెళ్తుండగా వ్యాన్ ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. దెందులూరు మండలం కొమిరేపల్లికి చెందిన బండి మనోహర్(35) వదిన మానేపల్లి జ్యోతి పెద్దకుమార్తె ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రసవించింది. ఆమె వద్దకు ఈనెల 17న మనోహర్, అతడి భార్య వేశంగి, జ్యోతి చిన్నకుమార్తె లావణ్య ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. రాత్రి పొద్దుపోవడంతో తంగెళ్ళమూడిలో ఉన్న మనోహర్ సోదరుడి ఇంటికి వెళ్ళారు. గురువారం ఉదయం వారు ముగ్గురూ బైక్‌పై ఆసుపత్రికి వస్తుండగా ఒక వ్యాను అతి వేగంగా వచ్చి ఢీ కొంది. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్ర గాయాలకు గురికాగా, మనోహర్‌ను ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్ళగా చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

బైక్‌ను ఢీకొట్టిన బస్సు.. ఇద్దరికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, జూలై 18 : మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరిని బస్సు ఢీకొనడంతో వారిద్దరికి కాళ్లు విరిగిపోయాయి. ఏలూరు తూర్పువీధికి చెందిన బాలాజీ, పి.వెంకటసీతామహాలక్ష్మి మోటారు సైకిల్‌పై ఏలూరు ఫైర్‌స్టేషన్ నుంచి పాతబస్టాండ్‌వైపు వెళ్తుండగా ఓవర్ బ్రిడ్జిపై ఆర్టీసీ బస్సు గురువారం మధ్యాహ్నం ఢీ కొంది. ఈ ప్రమాదంలో బాలాజీ కుడికాలు పూర్తిగా విరిగిపోగా, సీతామహాలక్ష్మి కుడికాలు తొడ భాగంలో విరిగిపోయింది. ప్రస్తుతం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా కేసు నమోదు చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

వ్యాన్ ఢీకొని మోటార్ సైక్లిస్ట్‌కి తీవ్ర గాయాలు

కరప, జూలై 18: కరప మండలం పెదకొత్తూరు చెరువువద్ద గురువారం వ్యాన్ ఢీకొని మోటార్‌సైక్లిస్ట్ తీవ్రంగా గాయపడ్డాడు. కరప పోలీసులు తెలిపిన వివరాలివి.. పెనుగొండ మండలం ఇలపర్రు గ్రామానికి చెందిన కట్టా పృధ్వీనాగ్ కాకినాడలోని ఒక వాషింగ్ మెషీన్ల సర్వీసింగ్ పాయింట్‌లో పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం రామచంద్రపురంలో వాషింగ్ మెషీన్ కంప్లైంట్ నిమిత్తం అతడు బైక్‌పై తిరిగి కాకినాడ ప్రయాణమయ్యాడు. పెదకొత్తూరు చెరువు టర్నింగ్ వద్దకు వచ్చేసరికి కాకినాడ నుంచి రామచంద్రపురం వైపు పనసకాయల లోడుతో వెళ్తున్న వ్యాన్ అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి సోదరుడు గూడూరి దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తూపాటి రామకృష్ణ తెలిపారు.

భీమవరంలో బియ్యం వ్యాపారి అదృశ్యం

▸▸ బాకీల వసూళ్లకు వెళ్లి ఇంటికి తిరిగిరాని వైనం

భీమవరం క్రైం, జూలై 18 : అతనొక హోల్‌సేల్ బియ్యం వ్యాపారి.. పలు దుకాణాలకు బియ్యం అమ్మకాలు కొనసాగించడమే కాకుండా వారికి ఇచ్చిన బియ్యం తాలూకా సొమ్ములు వసూళ్లకు పక్క గ్రామాలకు వెళ్లి ఇంటికి తిరిగి రాని ఘటన జరిగింది. భీమవరం వన్‌టౌన్ ఏఎస్ఐ దేవరాజ్ తెలిపిన వివరాలివి.. స్థానిక 18వ వార్డు గులాబీ సెంటర్‌లో నివాసం ఉండే గొంట్ల వెంకటనారాయణ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట హోల్‌సేల్ బియ్యం దుకాణం నడుపుతుంటారు. ఎప్పటిమాదిరిగా బియ్యం తాలూకా బకాయిల కోసం భీమవరం మండలంలోని పలు గ్రామాలకు ఈనెల 17వ తేదీన వెళ్ళారు. రాత్రి పది గంటలైన ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు, భార్య అన్నిచోట్ల వెతికారు. ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదు. 18వ తేదీ తెల్లవారుజాము నుంచి సెల్‌ఫోన్ పని చేయకపోవడంతో వ్యాపారి భార్య లక్ష్మీనారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

పార్టీలకు అతీతంగా సహకరించండి: పితాని

పెనుమంట్ర, జూలై 18 : పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి సహకరించాలని పెనుమంట్ర మండల పరిషత్ అధ్యక్షుడు కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి)ని మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కోరారు. గురువారం పోడూరు మండలం కొమ్ము చిక్కాల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో ఎవరి పార్టీకి వారు ఓట్లు వేస్తారని గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులను కలుపుకుంటూ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలన్నది తన లక్ష్యమని పితాని సత్యనారాయణ వివరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వాసంశెట్టి కిరణ్, ఈది అనిత,ఎంపీటీసీలు చింతపల్లి మంగాదేవి, నెలమూరు, నాగరాజులక్ష్మి, మంద్రుశాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వాసుపత్రిని తీర్చిదిద్దుతాం


ప్రభుత్వాసుపత్రిలో ఎక్స్‌కవేటర్‌తో డ్రెయినేజీ తవ్వుతున్న దృశ్యం

ఆకివీడు, జూలై 18 : సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి పనులు చేపట్టామని టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్ అన్నారు. ఆసుపత్రి సమీపంలో ఉన్న అనధికార డంపింగ్‌యార్డును త్వరలో తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష-కార్యదర్శులు బొల్లా వెంకట్రావు, గంధం ఉమా, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, మండల కార్యదర్శి నౌకట్ల రామారావు ఉన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్ అందజేత

ఆకివీడు, జూలై 18: సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కఠారి సత్యకుమారి దాతృత్వంతో పదివేల రూపాయలు విలువచేసే యూనిఫామ్‌ను గురువారం జిల్లా పరి షత్ బాలురు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందజేశారు. హెచ్ఎం పోతురాజు, ఉపాధ్యాయులు ఎం.వెంకటస్వామి, పి.అరవింద్ పాల్గొన్నారు.

ఆడపిల్లల్ని చదివించాలి


మాట్లాడుతున్న సీడీపీవో ఊర్మిళ

నరసాపురం టౌన్, జూలై 18: ఆడపిల్లలు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లినప్పుడు ఏదైనా సాధించవచ్చునని సీడీపీవో ఊర్మిళ అన్నారు. గురువారం పట్టణంలోని కొత్తపల్లి సుబ్బారాయుడు హైస్కూల్‌లో నిర్వహించిన బేటి బచావో బేటిపడావో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ప్రతి ఆడపిల్లను చదివించాలన్నారు. బాల్య వివాహాలు, రక్తహీనత, లైంగిక దాడులు, హత్యాచారాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్.పద్మావతి, అంగన్‌వాడీలు కృష్ణవేణి, సరస్వతి, ఉమా, మహిమ, శాంతి, అనిత, మౌనిక పాల్గొన్నారు.

షుగర్ పరీక్షలు

తణుకు, జూలై 18 :సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘ కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి ఆధ్వర్యంలో గురువారం 35 మందికి షుగర్ పరీక్షలు ఉచితంగా చేశారు. సంఘ సభ్యులు పెనుమర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌లో వినతుల స్వీకరణ


ఎమ్మెల్యే ఆరిమిల్లికి వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

తణుకు, జూలై 18 : ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రతిరోజు క్యాంపు కార్యాలయం లో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి గురువారం వివిధ సమస్యలపై వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశిస్తున్నారు.

పాత ఇనుము లోడింగ్ కార్మికులకు హామీ

వాహనాలు పెట్టుకోవడానికి స్థలం కేటాయించాలని పట్టణంలోని పాత ఇనుము లోడింగ్ కార్మికులు గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ విన్నవించారు. వేల్పూరు రోడ్‌లోని కప్పల వెంకన్న సెంటర్‌లో రోడ్డుపై కూర్చుని లారీ వచ్చిన తరువాత లోడింగ్ వెళుతున్నామన్నారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి స్థలం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

రెండు నెలలుగా జీతాల్లేవు

రెండు నెలలుగా వేతనాలు రావడం లేదని, సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు కోనాల భీమారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాధాకృష్ణకు వినతిపత్రం అందజేశారు. అలాగే ప్రభుత్వాస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల పీఎఫ్ ఖాతాల్లో సొమ్ము జమ చేయని ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కార్యదర్శి డి.పుష్పలత, ఎం. వెంకటలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు

నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అధికారులను ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, గృహ నిర్మాణ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వంలో నిర్మించిన ఇళ్లకు వెంటనే బిల్లులు అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ఇరగవరం, జూలై 18 : సూరంపూడికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త మాదాసు తులసి దుర్గా ధనసాయి ఇటీవల అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చికిత్స ధన సాయికి ఆరోగ్య అవసరాల నిమిత్తం రూ.10 వేలు క్యాంపు కార్యాలయంలో గురువారం అందజేశారు. ఎమ్మెల్యేకు జనసేన నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీలో చేరిక

యలమంచిలి, జులై 18: పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడు, నరసాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు సమక్షంలో మండలంలోని కలగంపూడి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పొత్తూరి కిరణ్‌రాజా తెలుగుదేశం పార్టీలో గురువారం చేరారు.

వృద్ధాశ్రమంలో భోజనాల వితరణ

పాలకొల్లు అర్బన్, జూలై 18 : పట్టణంలోని మావుళ్ళమ్మ పేటకు చెందిన డాక్టర్ ముమ్మడి రాజారెడ్డి ప్రజా వైద్యుడిగా కీర్తి పొందారని రాహుల్ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు జోగాడ కుమారి అన్నారు. ఇటీవల మృతి చెందిన డాక్టర్ రాజారెడ్డి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రాహుల్ వృద్ధుల ఆశ్రమంలో గురువారం ఉదయం ఫలహారం, మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం వృద్ధులకు నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజా రెడ్డి భార్య భారతీ దేవి, కుమారులు కృష్ణచైతన్య, హేమంత్ పాల్గొన్నారు.

కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

ఆచంట, జూలై 18: కిశోర బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతకు గురి కాకుండా ఉంటారని జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిక అభివృద్ధి అధికారి సుజాత రాణి అన్నారు. వంద రోజుల పౌష్టికాహారం రక్తహీనత సంరక్షణ చట్టాలు హక్కులు కార్యక్రమం పై స్థానిక ఎంపీపీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో కృష్ణకుమారి, ఎంఈవో ఉషారాణి, సూపర్‌వైజర్ శ్యామలాంబ , అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేట నిషేధ భృతి విడుదల చేయాలి

నరసాపురం రూరల్, జూలై 18: సముద్ర వేట నిషేధ భృతిని ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. గురువారం పీఎంలంక గ్రామంలో వేట నిషేధ భృతి విడుదల చేయాలంటూ ఆందోళన చేశారు. రెండు నెలల భృతి రూ.20వేలతో పాటు నిత్యావసర వస్తువుల్ని మత్స్యకారులకు అందించాలన్నారు. భృతిని సకాలంలో అందించకపోవడం వల్ల చాలా మంది మత్స్యకార కుటుంబాలు పస్తులతో ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.





ఆకివీడులో కాల్వను తలపిస్తున్న రహదారి... భీమవరంలో మునిగిన రహదారి.. మొగల్తూరులో నీట మునిగిన నారుమడులు.. సిద్ధాంతంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ముంచెత్తిన వర్షాలు

చెరువులను తలపిస్తున్న రోడ్లు.. మునిగిన వరి పొలాలు

ఆకివీడు/పాలకోడేరు/యలమంచిలి/పాలకొల్లు అర్బన్/పెంటపాడు/తాడేపల్లిగూడెం అర్బన్/తణుకు/ఆచంట/ పెనుగొండ/మొగల్తూరు/ఉండి//, జూలై 18 : వర్షాలు ముంచెత్తాయి. రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో వరి చేలు ముంపునకు గురయ్యాయి. కాల్వలు, డ్రెయిన్‌లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలు గురవారం ఉధృతం దాల్చాయి. ఆకివీడులో రహదారులు కాలువలు, చెరువులను తలపిస్తున్నాయి. మండలంలో ఐదు ఎకరాలు నారుమడలు, ఊడ్చిన పొలాలు 72 ఎకరాలు నీట మునిగాయని వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాసరావు, ఏవో ప్రియాంక తెలిపారు. గురువారం ఆకివీడు, అజ్జమూరు, మాదివాడ తదితర చోట్ల నీట మునిగిన నారుమడులు, ఊడ్చిన పొలాలను పరిశీలించారు. మండలంలో 4300 ఎకరాల వరికిగాను 238 ఎకరాల్లో నారుమడుడు వేయడమైందన్నారు.

- పాలకోడేరులో నారుమడులు నీటమునిగాయి. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి రైతులకు పంటపొలాలకు వెళ్ళే పరిస్థితి కూడా లేక నారుమడులను అలాగే వదిలేశారు. కచ్చా డ్రైన్లు సరిగా లేకపోవడం వలన రహదారులపై నీరు నిలిచింది.
- యలమంచిలి మండలంలో ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తుండటంతో వరి నారుమడులు నీట మునిగాయి. నీటిని బయటకు మళ్లించేందుకు రైతులు చేస్తున్న ప్రయత్నాలు ఎడతెరిపిలేని వానతో ఫలించడంలేదు. యలమంచిలిలో నీటమునిగిన వరి నారుమడులను ఏడీఏ ఇ.అనిల్ కుమారి, ఏవో దేవి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ నారుమళ్లు 5 రోజులుకన్నా ఎక్కువ నీటమునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. రైతులు ఐదురోజులలోపు నారుమళ్లలోని నీటిని పూర్తిగా బయటకు మళ్లించాలని సూచించారు. మండలంలో సుమారు 28హెక్టార్లలో నారుమడులు నీటమునిగాయని తెలిపారు.
- పాలకొల్లులో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. డ్రెయినేజీలు పొంగి పొర్లుతున్నాయి. 1వవార్డు బ్రాడీపేటలో రోడ్డు వర్షపు నీటితో నిండి ఉన్నాయి. ఎల్ఐసి కార్యాలయంరోడ్డు పెద్దపెద్ద గోతులు పడటంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే లాకుల వద్ద నుంచి పూలపల్లి వరకూ ఉన్న రోడ్డు గోతులమయంగా మారింది. రైలుగేటుకు ఇరువైపులా గోతులు ఉండటంతో పాటు పెద్దగా స్పీడు బ్రేకర్లు కూడా ఉండటంతో వాహన దారులు ఇబ్బందులు పడ్డారు. వరి చేలల్లో ఆకుమడులు మునిగిపోయాయి.
- పెంటపాడు మండలంలో గురువారం వర్షం దంచి కొట్టింది. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం వరుకు విరామం లేకుండా కురుస్తూనే ఉంది. భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. రహదారులు, వరి చేలు చెరువులను తలపిస్తున్నాయి.
- తాడేపల్లిగూడెం: పట్టణంలో గురువారం భారీ వర్షం కురిసింది. పలు వార్డులలోని రహదారులు కాలువలా మారాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.
- తణుకు పట్టణంలోని రాష్ట్రపతి రోడ్డుపై నీరు చేరింది. అధికారులు నీరు మళ్లింపునకు చర్యలు తీసుకున్నారు. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఈ వర్షం వలన వరి పంటలకు వచ్చిన ఇబ్బంది ప్రస్తుతానికి ఏమీ లేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.
- ఆచంట, పెనుగొండ మండలాల్లో పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. జోరు వాన పడుతుండటంతో ప్రజలు ఇంటికే పరిమితం అయ్యారు. మండలంలో డ్రెయిన్‌లు పొంగి పొర్లుతున్నాయి. జోరు వాన కారణంగా జనజీవనం స్తంభించిపోయింది.
- మొగల్తూరులో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షానికి సార్వా సాగు కోసం వేసిన నారుమడులు ముంపునీటిలో ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం కురుస్తున్న వర్షానికి ప్రధాన రహదారులలో వర్షం నీరు నిలిచిపోయింది. గత నెల 29, 30 తేదీలలో మండలంలో 61.2 మిల్లీ మీటర్లు, ఈనెల 3వ తేదీన 35 మిల్లీ మీటర్లు, 5వ తేదీన 35.2 మిల్లీ మీటర్లు, 16,18 తేదీలలో 55.4 మిల్లీ మీటర్లు వర్షం కురిసింది.
- ఉండిలో రహదారులపై వర్షపునీరు చేరింది. కురుస్తున్న డ్రెయినేజీలు నిండి రోడ్లపైకి మురుగునీరు చేరింది. బస్‌స్టాండ్‌ను వర్షపునీరు చుట్టిముట్టింది.
- గణపవరం మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాలు వెలవెలబోయాయి. ఏకధాటిగా కురిసిన వర్షాలకు ప్రజలు ఇళ్లకే పరిమితం అయ్యారు. రహదారులు, పల్లపు ప్రాంతాలు వర్షపునీటితో జలమయం అయ్యాయి. వరినారుమడులు నీటిలో తేలియాడుతున్నాయి.

జగనన్న కాలనీలో ప్రజల అవస్థలు

ఇరగవరం, జూలై 18 : కురుస్తున్న వర్షాలతో ప్రధాన రహదారులు, గ్రామాల్లోని వీధులు జలమయం అయ్యాయి. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రోడ్లపై నీరు నిలిచి పలు ప్రాంతాలు చిన్నపాటి చెరువులుగా మారాయి. వైసీపీ ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన ఇళ్ళ స్థలాల లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇరగవరంలో 10.15 ఎకరాల స్థలాన్ని 320 మంది పేదలకు ఇచ్చారు. తక్షణం కట్టుకోకుంటే స్థలాల కేటాయింపు రద్దు చేస్తామని ఒత్తిడి చేయడంతో అక్కడ కనీస సౌకర్యాలు లేకపోయినా నిర్మాణాలు ప్రారంభించారు. వాటిలో సుమారు 150 మంది ఇళ్ళ నిర్మాణం చేపట్టుకుని నివసిస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రహదారులు బురదమయం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నెల రోజుల్లో వంద పడకల ఆసుపత్రి: మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, జూలై 18: పాలకొల్లు వంద పడకల ఆసుపత్రి భవనాన్ని గురువారం రాష్ట్ర ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. అనంతరం అధికారులు, వైద్యాధికారులతో ఆసుపత్రి భవన నిర్మాణ పనులపై ఆయన సమీక్షించారు. నెలరోజుల్లో వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. గత టీడీపీ ప్రభుత్వం వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి రూ.12కోట్లు 60లక్షలు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టిందని దురదృష్టవశాత్తు వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆసుపత్రి భవన నిర్మాణ పనులపై శ్రద్ధ పెట్టకుండా ఐదేళ్లు గాలికొదిలేసింద అన్నారు. అనంతరం మంత్రి ప్రభుత్వం ఆసుపత్రిని సందర్శించారు. అన్ని వైద్యవార్డులు తిరిగి రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్యసౌకర్యాలపై రోగులను అడిగి తెలుసుకున్నారు.

జనసేన సభ్యత్వం అధికంగా జరగాలి: అంజిబాబు


జనసేన సభ్యత్వ నమోదును ప్రారంభించిన ఎమ్మెల్యేఅంజిబాబు

భీమవరం టౌన్, జూలై 18 : భీమవరం నియోజకవర్గంలో అత్యధికంగా జనసేనపార్టీ సభ్యత్వాలు నమోదు అయ్యేలా జనసైనికులు, వీర మహిళలు కృషి చేయాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) పిలుపు నిచ్చారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో పార్టీ మెంబర్‌షిప్ వలంటీర్స్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జనసేన పార్టీలో 500 రూపాయలు చెల్లించి క్రియాశీలక సభ్యులుగా చేరితే 5 లక్షల రూపాయల ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. గాయపడిన వారికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50 వేల రూపాయలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చినబాబు మాట్లాడుతూ ఈనెల 18నుంచి 28వ తేది వరకు జరిగే పార్టీ సభ్యత్వ నమోదులో భీమవరంనియోజకవర్గంలో 15వేల సభ్యత్వాలు నమోదు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చనమల్ల చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు మోకా శ్రీనివాస్, పార్టీ ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి వబిలిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

బాధితులకు చెక్కులు అందజేత

ఆకివీడు, జూలై 18 : క్రియాశీలక సభ్యత్వం పొందిన కార్యకర్తలు ప్రమాదవశాత్తు గాయపడడంతో ఆర్థిక సహకారం అందిస్తున్నామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు తెలిపారు. జనసేన పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులు నేతృత్వంలో మజ్జి మూర్తికి రూ.29వేలు, కొట్టు సాయితేజకు రూ.17వేలు గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో చెక్కులు అందజేశారు.

యువతకు యూత్ హాస్టల్స్ దిక్సూచి


డాక్టర్ సోమరాజును సత్కరించిన దృశ్యం

భీమవరం టౌన్, జూలై 18: యూత్ హాస్టల్స్ యువతకు దిక్సూచి వంటిదని, యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని యూత్ హాస్టల్స్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సోమరాజు అన్నారు. బ్యాంక్ కాలనీలో యూత్ హాస్టల్స్ భీమవరం యూనిట్ 35వ వార్షికోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహాజన సభలో నందమూరి రాజేశ్ కార్యదర్శి నివేదిక సమర్పించగా, కోశాధికారి, శ్రీరామ్ జమా ఖర్చులు నివేదించారు. కార్యక్రమంలో యూనిట్ అధ్యక్షుడు మంతెన వెంకట నరసింహ సీతారామరాజు రాజు, యూనిట్ పూర్వ అధ్యక్షుడు మల్లినీడి తిరుమలరావు, భీమవరం యూనిట్ వ్యవస్థాపకులు డాక్టర్ ఆరేటి వెంకట సత్యనారాయణ, కంతేటి వెంకట్రాజు, రంగసాయి, యూనిట్ చైర్మన్, ప్రొఫెసర్ మట్లపూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలకు అదనపు గదులు నిర్మించాలి

భీమవరం రూరల్, జూలై 18 : తుందుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు గదులకు నిధులు మంజూరైనా వాటిని ఇతర పాఠశాలలకు పింపించేశారని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోట గంగరాజు జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కర్‌కు గురువారం వినతిపత్రం అందించారు. నాడు-నేడు పథకంలో రూ.48లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. దీనిని అధికారులు గుర్తించి వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

అత్తిలి, జూలై 18 : పని ప్రదేశంలో మహిళలను వేధిస్తే లైంగిక వేధింపుల చట్టం కింద చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ తణుకు ప్రాజెక్టు అధికారి బి.ప్రమోదకుమారి హెచ్చరించారు. తిరుపతిపురంలో గురువారం ఏవీఆర్ మెరైన్స్‌లో మిషన్ శక్తి కార్యక్రమం నిర్వహించారు. పర్యవేక్షకురాలు ఎం.శ్రీదేవి వంద రోజులు కార్యక్రయాన్ని జయప్రదం చేయాలని కోరారు. మహిళా సంరక్షక కార్యదర్శి రాగసుధ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



తాడేపల్లిగూడెం రూరల్, జూలై 18: మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం తాడేపల్లిగూడెంలోని రామచంద్రరావుపేటలోని నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు, బియ్యం బస్తా, రూ. రెండు వేల నగదు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు పత్సా వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎర్రా ఆంజనేయస్వామి, కోశాధికారి యెగ్గిన శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

పాలకొల్లు అర్బన్, జూలై 10 : బీఆర్ఎంవీఎం హైస్కూల్లో టీచ్ టూల్ అబ్జర్వర్స్ ట్రైనింగ్ 3వ ఫేస్‌ను గురువారం ప్రారంభించారు. ఈ శిక్షణ తరగతులు ఈనెల 27వ తేదీ వరకు నిర్వహిస్తున్నమని మండల విద్యాశాఖాధికారి, కోర్సు కో ఆర్డినేటర్ గుమ్మళ్ళ వీరాస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్యాంశ నిర్వహణ, సానుకూల అభ్యాసన ప్రక్రియలు, తులనాత్మక ఆలోచనలు తదితర అంశాలపై ఉపాధ్యాయుల బోధన పటిమ, సామర్థ్యాలను పరిశీలించారు.

హెల్మెట్ రక్షణ కవచం


నరసాపురంలో హెల్మెట్లపై అవగాహన

నరసాపురం టౌన్, జూలై 18: హెల్మెట్ ధరిస్తే ప్రమాదాలు జరిగి నా.. ప్రాణాప్రాయం నుంచి కాపాడుకోవచ్చునని జిల్లా అద నపు న్యాయమూర్తి విజయదుర్గా అన్నారు. గురువారం హెల్మెట్‌లపై నిర్వహించిన అవగాహన ప్రదర్శనను ఆమె అంబేడ్కర్ సెంటర్‌లో ప్రారంభించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు గంగరాజు, వరలక్ష్మి, శ్రీనివాస్, న్యాయవాదులు చల్లా దానయ్యనాయుడు, అర్‌కె కుమార్ పాల్గొన్నారు.

భీమవరం క్రైం: హెల్మెట్ ధరిస్తే ప్రయాణం సురక్షితమని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని భీమవరం మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి డి.సత్యవతి అన్నారు. న్యాయమూర్తులు, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో హెల్మెట్‌పై గురువారం నాడు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

తణుకు: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి కృష్ణసత్యలత, రెండోవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఏవీ నాగరాజు, సీనియర్ న్యాయవాది కౌరు వెంకటేశ్వర్లు, సీఐలు నాగరాజు, జీవీవీఎస్ నాగరాజు, ఎస్ఐ జానా సతీష్ పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 18 : భారీ వర్షాలు కురు స్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం అధికారులు, శానిటేషన్ సిబ్బందితో అత్యవసర సమావేశం నిర్వహించారు. అధికారులు ఎవరైనా సెలవులో ఉండే వెంటనే విధుల్లో చేరాలన్నారు. ఏలూరు కాలువకు విజ్జేశ్వరం నుంచి విడుదల చేస్తున్న నీటిని తగ్గించాలని అధికారులకు ఫోన్లో సూచించారు. ఎర్రకాలువ పరివాహక ప్రాంతాలలో రైతులను ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని రైతులు ఆందోళన చెందవద్దన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: వలవల



తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 18: భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి సూచించారు. పార్టీ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం డ్రైనేజీలను నిర్లక్ష్యం చేయడం వల్ల వర్షం నీరు బయటకు పారడం లేదన్నారు. అధికారులు వర్షం నీటిని బయటకు మళ్ళించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలన్నారు. రూరల్ మండలంలోని జగన్నాథపురం, అప్పారావు, నందమూరు తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఎమ్మెల్యేకు ఆశ వర్కర్ల వినతి

భీమవరం టౌన్, జూలై 18 : సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుకు ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. యూనియన్ నాయకులు లారెన్స్‌కుమారి, వరలక్ష్మి మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని గతంలో చేసిన ఆందోళన ఫలితంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను మినిట్స్ కాపీని కూడా ఎమ్మెల్యేకు అందజేశామని తెలిపారు.

రహదారిని మెరుగుపర్చాలని వినతి

మొగల్తూరు, జూలై 18:మొగల్తూరు ప్రధాన రహదారిని పూర్తిస్థాయిలో మెరుగుపర్చాలని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడుకు స్థానిక టీడీపీ నాయకులు విన్నవించారు. గురువారం మొగల్తూరు వచ్చిన మంత్రి నిమ్మలను మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా గాంధీబొమ్మల సెంటర్‌లో రహదారి దుస్థితిని వివరించారు. మంత్రి వెంట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు తదితరులున్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 18 : విద్యార్థులు చిన్ననాటి నుంచే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మాగంటి ఫంక్షన్ హాల్‌లో ఆత్మ బంధువులు శివశక్తి టాలెంట్ టెస్ట్ కార్యక్రమంలో గురువారం ఎమ్మెల్యే పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

బాల్య వివాహాలు నేరం

పెంటపాడు, జూలై 18 : బాల్య వివాహాలు చేయడం నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. పెంటపాడులో గురువారం బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. కొత్త చట్టాలపై తల్లిదండ్రులకు అవగాహన ఉండాలని తెలిపారు. సచివాలయం మహిళా పోలీసులు, అంగన్‌వాడీ టీచర్లు , తల్లులు పాల్గొన్నారు.

బండి ముత్యాలమ్మను దర్శించుకున్న మంత్రి సుభాష్



మొగల్తూరు, జూలై 18: ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారిని గురువారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ట్రస్టుబోర్డు చైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఆలయ సిబ్బంది స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

నరసాపురంలో ఈఎస్ఐ డిస్పెన్సరీ: మంత్రి సుభాష్

నరసాపురం, జూలై 18: త్వరలో నరసాపురంలో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేస్తున్నట్లు కార్మికశాఖ మంత్రి సుభాష్ చెప్పారు. గురువారం జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన్ను భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, లేబర్ అధికారి కార్యాలయాన్ని నరసాపురంలో ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి స్పందించిన మంత్రి మాట్లాడుతూ నరసాపురంలో 20వేల మంది కార్మికులు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరి సంక్షేమం కోసం తక్షణం మందుల డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని అధికారుల్ని ఆదేశించామన్నారు. భవనం చూపిస్తే త్వరలో కార్మికులకు అందుబాటులోకి వస్తుందన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. త్వరలో అన్ని నియోజకవర్గాల్లో పటిష్టంగా ఈ విధానాన్ని అమలు చేస్తామన్నారు. ఉచిత ఇసుక అమల్లోకి వస్తే కార్మికులకు ప్రతి రోజు ఉపాధి ఉంటుందన్నారు రాష్ట్రంలో నిర్మాణరంగం దూసుకుపోతుందన్నారు. ఇదే తమ ప్రభుత్వ లక్ష్యమని కార్మికులకు వివరించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే నాయకర్, కార్మిక సంఘం నాయకులు భీమాల శ్రీనివాస్, పిండి ఆదినారాయణ, పోలిశెట్టి సాంబ, వలవల నాని, గంటా కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలసిన ఎస్పీ



భీమవరంటౌన్, జూలై 18 : కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను గురువారంనాడు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు. ఈసందర్భంగా పలు విషయాలనువారు చర్చించుకున్నారు.

స్పర్శ లేని రాగి రంగు మచ్చలను అశ్రద్ధ చేయవద్దు


పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యశాఖాధికారి మహేశ్వరరావు

పాలకొల్లు రూరల్, జూలై 18 : శరీరంపై స్పర్శ లేని, రాగి రంగు మచ్చలను అశ్రద్ధ చేయవద్దని జిల్లా వైద్యశాఖాధికారి మహేశ్వరరావు అన్నారు. లంకలకోడేరు పీహెచ్‌సీ దగ్గులూరులో గురువారం లెప్రసీ వ్యాధిపై జరుగుతున్న ఇంటింట సర్వేను మహేశ్వరరావు ఆకస్మికంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసర్వే ఆగస్టు 2వ తేదీ వరకూ జరుగుతుందని తెలిపారు. అనంతరం పీహెచ్‌సీలోని ఆపరేషన్ థియేటర్, లేబొరేటరీ, లాబ్ టెక్నీషియన్, ఫార్మసీ రూములు తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు

భీమవరం టౌన్, జూలై 18 : జిల్లాలో ఎక్కడైనా గర్భస్థ పిండ లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లుగా తమ దృష్టికి వస్తే స్కానింగ్ సెంటర్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ డి.మహేశ్వరరావు హెచ్చరించారు. డీఎంఅండ్ హెచ్‌వో కార్యాయలంలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశానికి ఆయన పాల్గొని మాట్లాడారు. లింగ నిర్ధారణ నిషేధ చట్టం-1994, రూల్స్ 1996 ప్రకారం స్కానింగ్ సెంటర్లు తప్పని సరిగా చట్టం అమలు చెయ్యాలని ఆదేశించారు. ప్రోగ్రాం అధికారులు తప్పనిసరిగా స్కానింగ్ సెంటర్లను ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించి నివేదికలు ఇవ్వాలని అన్నారు. అదే విధంగా ఆర్డీవో కార్యాయలంలో కూడా సమావేశం నిర్వహించారు. స్కానింగ్ సెంటర్లు తప్పనిసరిగా రెన్యూవల్ చేయించుకోవాలని, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. డాక్టర్ భాను నాయక్ మాట్లాడుతూ జిల్లాలో డెకాయ్ ఆపరేషన్‌లు నిర్వహించటం జరుగుతుందని, పోలీస్ సహకారంతో జరుగుతాయన్నారు. సమావేశంలో డాక్టర్ కె ప్రవీణ్, కుమార్ పాల్గొన్నారు.

విజయసాయి రెడ్డి వ్యాఖ్యలపై ఫిర్యాదు

పాలకొల్లు రూరల్, జూలై 18 : రాజ్యసభ సభ్యుడు విజయ సాయి రెడ్డి ఇటీవల మీడియా ప్రతినిధులపై చేసిన వ్యాఖ్యలపై ప్రెస్‌క్లబ్ సభ్యులు, కూటమి నాయకులతో కలిసి గురువారం తహసీల్దార్ మధుసూదనరావుకు వినితి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు జేఎస్ ప్రసాద్, పోకల రాము, నరేష్, తమ్మినీడి మురళీ కృష్ణ, జనసేన నాయకులు శిడగం రామలింగేశ్వరరావు, తుల నరేంద్ర, రాపాక నగేష్ కరుణాకర్ తదితరులు ఉన్నారు.

అగ్నికుల క్షత్రియ మండలాధ్యక్షుడిగా ప్రసాద్


ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న అగ్నికుల క్షత్రియ సంఘ నాయకులు

యలమంచిలి, జులై 18: యలమంచిలి మండల అగ్నికుల క్షత్రియ సంఘం అధ్యక్షుడిగా బర్రే ప్రసాద్ ఎన్నికయ్యారు. యలమంచిలిలో గురువారం నిర్వహించిన అగ్నికుల క్షత్రియ సంఘం సమావేశంలో మండల అధ్యక్షుని ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మండల అధ్యక్షుడిగా ఎన్నికైన బర్రే ప్రసాద్ భార్య మేరీ యలమంచిలి గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రసాద్ దంపతులను ఆ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు లంకే ధర్మరాజు, చింతా దుర్గాప్రసాద్, పెసింగి ఏసు, గాడి శ్రీను, రామాంజనేయులు, పెద్దిరాజు, ఏసురాజు తదితరులు సత్కరించారు.